www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 1 అక్టోబర్ 2024

5

అన్నమయ్య

ఆక్రమణలు కూల్చివేత

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని పోలి అప్పారాజుపేట పంచాయతీలో ఓ ఎన్ఆర్ఐ గ్రామానికి సేవ చేస్తాననే ముసుగులో 831 బి సర్వే నెంబరులో ఆక్రమించిన 80 సెంట్లు ప్రభుత్వ స్థలంపై ఆ గ్రామ దళితులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి సోమవారం రెవెన్యూ అధికారులచే జెసిబితో ఆక్రమణ స్థలం చుట్టూ కట్టిన గోడను తొలగించారు. ఎన్ఆర్ఐకు సహకరించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన విద్యుత్ సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో లేదోనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

జెసిబితో ప్రహరీని కూల్చివేస్తున్న అధికారులు

కదంతొక్కిన కార్మికులు

- కలెక్టరేట్ ఎదుట నిరసనలో సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, రామాంజులు

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

సమస్యలు పరిష్కరించాలని కార్మికులు కదం తొక్కారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఆప్కాస్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, ఎంటిఎస్ అమలు చేయాలని, కనీసవేతనం ఇవ్వాలని, అంగన్‌వాడీల పట్ల రాజకీయ వేధింపులు ఆపాలని సోమవారం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.చంద్రశేఖర్, ఎ.రామాంజులు మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగులు చేసే పనినే కాంట్రాక్టు ఉద్యోగులతో చేయిస్తున్నప్పుడు పర్మినెంట్ ఉద్యోగులకు ఇచ్చే అన్ని సదుపాయాలు కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇవ్వాలని సుప్రీం కోర్టు 2013లో ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో ఏ కార్యాలయంలో కూడా అమలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వాలే ఉద్యోగుల శ్రమను దోపిడీచేయడం అన్యాయమన్నారు. ఈ ఆందోళన దేశవ్యాప్తంగా 660 జిల్లాల్లో జరుగుతుందని, ఐక్య కార్మిక ఉద్యమాలకు శ్రీకారం చుట్టామని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు మాత్రం నెల జీతం రూ.రెండు లక్షల తీసుకుంటుంటే, కనీస వేతనం రూ.26 వేలు మాత్రమే అడుగుతున్నామని, చెల్లించకపోతే పెరుగుతున్న ధరలతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు కాంట్రాక్టు ఉద్యోగులు చనిపోతుంటే కుటుంబాలు రోడ్డునపడుతున్నాయని, ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి సహాకారం కూడా అందడంలేదన్నారు. కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లు రాష్ట్రంలో అమలు చేయడానికి నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. 50 లక్షల జనాభకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ చట్టం వేతన సవరణ చేసి 15 ఏళ్ళ దాటిందని, తక్షణం కనీస వేతన సలహా మండలి నియమించి షెడ్యూల్ పరిశ్రమల్లో కార్మికులకు వేతన సవరణ చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు అన్ని పరిశ్రమలలో సేఫ్టీ ఆడిట్లు నిర్వహించాలని కోరారు. 240 రోజులు సర్వీసు పూర్తి చేసుకున్న ప్రతి కాంట్రాక్టు ఉద్యోగిని, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కార్మికులకు 2022 అరియర్స్ బకాయిలు సబ్ స్టేషన్లకు వాచ్‌మెన్లు కేటాయించాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు 15వ ఆర్థిక సంఘం నిధులు పెండింగ్ జీతాలకు 50 శాతం వినియోగించాలన్నారు. సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు, చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉపాధి ఇవ్వాలన్నారు. ఎనిమిది గంటలు పని అమలు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 15 నెలల పెండింగ్ బకాయిలు మరియు ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోని గెస్ట్ ఫాకల్టీని రెగ్యులర్ చేయాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ పిఎఫ్ బకాయిలు చనిపోయిన వారి కుటుంబంలో ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ వారికి పెండింగ్ జీతాలివ్వాలని తెలిపారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వారు రెగ్యులర్ అయ్యేందుకు చేసే పోరాటాలకు సిపిఎం సంపూర్ణ సహకారం ఇస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మరి పేర్కొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు అందజేశారు. కార్యక్రమంలో యుటిఐయు రాష్ట్ర డిస్కమ్ నాయకులు కె.సుబ్రహ్మణ్యంరాజు, నారాయణ, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మధుకర్, సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా అధ్యక్షులు మురళి మోహన్‌రాజు, మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మిదేవి, గెస్ట్ లెక్చరర్స్ జిల్లా ఇన్‌ఛార్జి రహంతుల్లా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.ఓబుశెట్టి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి.భాగ్యలక్ష్మి, వివిధ రంగాలకు చెందిన నాయకులు ఖదిర్, సుబ్బారెడ్డి, ఆనంద్, పెద్దిరెడ్డి, రవి, ప్రభాకర్‌రెడ్డి, జగదీశ్, రామాంజులు, ఈశ్వరయ్య, అలీ, రమణ, నర సింహులు, భాస్కర్, సిద్ధయ్య, నాగరాజు, వెంకట్రామిరెడ్డి, కృష్ణయ్య, పద్మావతి, ధనశేఖర్, ఖాజాబీ, విజయమ్మ, సిద్దమ్మ, అరుణ, శేఖరనాయక్, రెడ్డెయ్య, ఖాదర్‌వలి, మాధవయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో దారుణం

కూతుర్ని ప్రేమిస్తున్నాడని కొట్టి చంపిన తండ్రి - ఆలస్యంగా వెలుగు చూసిన యువకుడి హత్య ఉదంతం

సూర్యనారాయణ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లి నియోజకవర్గంలోని బి.కొత్తకోటలో దారుణం చోటు చేసుకుంది. మండలంలోని అయ్యప్పగారిపల్లి గ్రామం, గుట్టమీద దళితవాడకు చెందిన రంగాల వెంకటరమణ, లక్ష్మి దంపతులకు రెండవ కుమారుడు సూర్యనారాయణ(25) మదనపల్లె ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద ఓ ఫోటో స్టూడియోలో పనిచేస్తున్నాడు. డి.జయన్న 19 ఏళ్ల కుమార్తెను ప్రేమిస్తున్నట్లు తెలుసుకొని ఇటీవల సూర్యనారాయణను మందలించినట్లు తెలిసింది. అయితే అతను తన తీరు మార్చుకోకుండా ఆ యువతిని ప్రేమిస్తూ ఉండడంతో ఆగ్రహించిన ఆమె తల్లిదండ్రులు ఆదివారం రాత్రి గ్రామ సమీపంలో దారి కాసి మదనపల్లె నుండి ఇంటికి వెళుతున్న సూర్యనారాయణను అడ్డగించి కొట్టి చిత్రహింసలకు గురిచేశారు. తీవ్రంగా గాయపడి ఇంటికి వచ్చిన సూర్యనారాయణ తనకు జరిగిన అవమానం, కొట్టిన దెబ్బల విషయం తల్లిదండ్రులకు చెప్పుకోలేకపోయాడు. మనసులోనే మదన పడుతూ ఇంట్లో పడుకున్న సూర్యనారాయణ తెల్లవారిసరికే కన్నుమూశాడు. బిడ్డ ఉన్నపలంగా చనిపోవడంతో ఆరా తీసిన తల్లిదండ్రులకు అసలు విషయం వెలుగు చూసింది. అదే గ్రామానికి చెందిన పల్లవి తండ్రి జయన్న, అతని అన్న అమర్నాథ్ సూర్యనారాయణను దారుణంగా కొట్టడం వల్లనే చనిపోయాడని గుర్తించారు. కుటుంబ సభ్యులు బంధువులతో వెళ్లి బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సలహా మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె సర్వజన బోధనాసుపత్రిలోని తరలించారు. తన బిడ్డను అన్యాయంగా కొట్టి చంపారని మృతుడు సూర్యనారాయణ తండ్రి వెంకటరమణ ఆరోపిస్తున్నాడు. కొట్టి చంపడం వల్ల సూర్యనారాయణ చనిపోయాడా.. లేక ఇతర కారణాలతో చనిపోయాడా అన్నది పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తేలాల్సి ఉందని బి.కొత్తకోట సిఐ రాజారెడ్డి తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేద్దాం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాజకీయాలకతీతంగా రాయచోటి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి మున్సిపల్ కౌన్సిల్ సభా భవనంలో చైర్మన్ ఫయాజ్ బాషా అధ్యక్షతన జరిగిన రాయచోటి పురపాలక కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 110 రోజులు అయిందని రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం డిఎస్‌సితోపాటు పాటు ఇతర స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నామని దసరా నుంచి రాష్ట్రంలో పేదలకు మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇవ్వబోతున్నామని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే ఉచిత బస్సు సౌకర్యం కూడా మహిళలకు అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రభుత్వాలు, నాయకులు మారినా ప్రజలకు మంచి చేసే విధంగానే ఉండాలని అదే తమ నినాదం అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాయచోటి పురపాలకలో అభివృద్ధి పనులు చేపడుతామని చెప్పారు. ఇందుకు పురపాలక పాలకపక్షం సహకరించి ముందుకు వెళ్లాలన్నారు. అర్హులైన వృద్ధులకు పెన్షన్లు, పేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని పురపాలకలో గత పాలనలో వచ్చిన నిధులు ఎక్కడ వెచ్చించారో కూడా తెలియని పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. వెలుగల్లు నీటి పథకం ద్వారా పట్టణానికి తాగునీరు అందించే ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. పట్టణంలో రెవెన్యూ స్థలాలను గుర్తించి కాంప్లెక్స్‌ల నిర్మాణానికి చర్యలు తీసుసుకుంటామని చెప్పారు. రాయచోటి మార్కెట్ యార్డును పునరుద్ధరించడం, అన్ని వర్గాలకు సంబంధించి శ్మశాన వాటికల ఏర్పాటు కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పట్టణంలో కుక్కల సమస్య ఉన్నట్లు దృష్టికి వచ్చిందని, పరిష్కారానికి కూడా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాయచోటి పాత టౌను, మిగిలిన చోట్ల పాత విద్యుత్తు ఉన్నాయని వాటిని తొలగించి కొత్త పోల్స్ ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రానున్న ఐదు సంవత్సరాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామని, అందరి సహకారంతో రాయచోటి నియోజకవర్గాన్ని రానున్న ఐదేళ్లలో అభివృద్ధి చేసి తీరుతానని ఆయన పేర్కొన్నారు. అంతకుముందుగా కౌన్సిల్ సమావేశంలో సభ్యులు వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నిటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు మంత్రి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాసు బాబు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో స్వల్ప మార్పులు, చేర్పులు : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

రాజకీయ పార్టీల అభిప్రాయాలు, నిబంధనల మేరకు అన్నమయ్య జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (స్వల్ప మార్పులు, చేర్పులు) చేయబోతున్నట్లుగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అన్నమయ్య జిల్లాలో ఓటర్ల సవరణ - 2025, పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ నరసింహ కుమార్ జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ఓటర్ల సవరణ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పై రాజకీయ పార్టీ ప్రతినిధులకు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేటితో ఓటర్ల సవరణపై ఇంటింటికి వెళ్లి సర్వే చేసే ప్రక్రియ పూర్తయిందన్నారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి రాజంపేటలో ఒక నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటు, రాయచోటిలో 8 పోలింగ్ కేంద్రాల స్థానం మార్పు, తంబళ్లపల్లిలో ఒక పోలింగ్ కేంద్రం పేరు మార్పు, మదనపల్లి నియోజకవర్గంలో రెండు పోలింగ్ కేంద్రాల స్థానం మార్పు, తదితర అంశాలను రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. ఈ మార్పులు, చేర్పులపై ఇదివరకే ఆ నియోజకవర్గాలకు సంబంధించిన సబ్ కలెక్టర్ లేదా ఆర్‌డిఒ అక్కడి రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించామని చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపమని రాజకీయ పార్టీ ప్రతినిధులను అడగగా అభ్యంతరాలు ఏమీ లేనట్లుగా వారు తెలిపారు. కొత్తగా ఏమైనా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులు కావాలి అనుకుంటే దానికి మళ్ళీ ఎన్నికల సంఘం వారు అవకాశం ఇస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులపై నివేదికను కేంద్ర ఎన్నికల సంఘం వారికి త్వరలో పంపుతున్నట్లుగా కలెక్టర్ పేర్కొన్నారు. మార్పులు, చేర్పుల నివేదికను ఎన్నికల సంఘం వారు అంగీకరించిన తర్వాత జిల్లాలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులపై ప్రజలందరికీ తెలిసేలా చర్యలు చేపట్టాలని ఎలక్షన్ సెల్ అధికారులను, రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు.

'ముదివేడు' నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ముదివేడు బాధితులు, నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ముదివేడు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ప్రజా సమస్యల పరిస్కార వేదిక కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ముదివేడు రిజర్వాయర్ నిర్మించాలని తలపెట్టి అనేక అవకతవకలకు పాల్పడి రైతులను ముంచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం పోరాటం ఫలితంగా ముంపునకు గురయ్యే భూములను, ఇళ్లను గుర్తించడం కోసం ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించి, అవార్డు కూడా ప్రకటించిందని గుర్తుచేశారు. దాదాపు 780 ఎకరాల భూములకు రూ. 108 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ప్రకటించినా అమలుకు నోచుకోలేదన్నారు. కూరబలకోట, బి.కొత్తకోట మండలాల పరిధిలోని ఐదు గ్రామాలు పూర్తిగా మునిగిపోతున్నాయని ఒక్క రూపాయి నష్టపరిహారం ఇవ్వలేదని వాపోయారు. భూముల్లో మట్టిని తవ్వేసిన కారణంగా వ్యవసాయానికి పనికిరాకుండా పోయాయాని, రిజర్వాయర్ నిర్మాణ సంస్థ రైతులకు లీజు చెల్లిస్తామని చెప్పి మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముదివేడు రిజర్వాయిర్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, భూములు,ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికీ 5 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం రూ. 25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డికెటి పరిహారం ఇవ్వాలని, భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ. 5లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని పేర్కొన్నాపరు. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని, ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేయని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందచేశారు. సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పందికాళ్ళ మణి, ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితుల సంఘం నాయకులు సురేంద్రరెడ్డి, ముక్తుమ్ బాషా, ప్రభాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

వంద శాతం పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో అక్టోబర్ 1న వందశాతం శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరగాలని, ఉదయం 6 గంటల నుంచి పంపిణీ ప్రారంభించాలని కలెక్టర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం డిఆర్‌డిఎ పీడీ, మున్సిపల్ కమిషనర్లు, డిపిఒ, ఎంపిడిఒలు, డిఎల్ డిఒలు, ఎల్‌డిఎం తదితర అధికారులతో అక్టోబర్ 1 జరగబోయే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందుబాటులో లేని వారు, ఆసుపత్రులలో చికిత్స తీసుకుంటున్నారు తప్ప మిగతా 99 శాతం పింఛన్ల పంపిణీ ఒకటో తారీకునే జరగాలన్నారు. లబ్ధిదారులకు ముందస్తు సమాచారాన్ని టామ్ టామ్ , ఇతర మాధ్యమాల ద్వారా అందించి వారు ఇంటి వద్దనే ఉండేలా చూడాలన్నారు. ఒకటో తారీకు ఉదయం 6 గంటలకు పంపిణీ మొదలు పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు కార్యక్రమంలో పాల్గొనేటప్పుడు ఏ ఇంటిలో లబ్ధిదారులుంటారో ఆ ఇంటి వారు మాత్రమే పింఛను పొందేలా చూడాలన్నారు.

వేలం పాట ద్వారా రూ.45.20 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు వాహనాల ప్రవేశ రుసుం వసూలుకు సోమవారం మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటలో కలకడ మండలం దొడ్డిపల్లికి చెందిన కె.అనిల్ కుమార్ రూ.45.20 లక్షలకు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఏడాది కాలానికి గాను ఈ వేలంపాట నిర్వహించడం జరిగిందని, హార్సిలీ కొండపైకి వెళ్లే ద్విచక్ర వాహనానికి రూ.50, ఆటోలకు రూ.70, కార్లకు రూ.100, పెద్దవాహనాలకు రూ.200లుగా ప్రవేశ రుసుం ఖరారు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకే వాహనాల వద్ద రుసుం తీసుకోవాలని సూచించారు. గత ఏడాది రూ.27.30 లక్షలకే గేటు వసూలును దక్కించుకోగా, ఈ ఏడాది చాలా మంది పోటీ పడడంతో రూ.45.20 లక్షలు పలకడంతో ప్రభుత్వం ఆదాయం పెరిగిందని వెల్లడించారు.

జ్యోతి సొసైటీ సుభద్రకు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

ప్రపంచ శాంతి, మత సామరస్యాన్ని పెంపొందించేలా తమ సంస్థ ద్వారా ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలను చేపట్టినందుకు మదనపల్లె గ్రామ జ్యోతి సొసైటీ నిర్వాహకులు సుభద్రకు ఉత్తమ సిసి అవార్డు దక్కింది. ప్రపంచంలోని అన్ని మతాల సామరస్య సాధన, ప్రపంచాన్ని శాంతితో, సహృద్భావంతో ముందుకు సాగి సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని అభివృద్ధి చేయ డానికి ఉద్దేశించబడిన కార్యక్రమం (యునైటెడ్ రిలీజియన్స్ ఇనిషియేటివ్) యుఆర్ఐ 25 సంవత్సరాల క్రితం దక్షణ భారతదేశంలో ప్రారంభం చేసి ప్రస్తుతం సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఊటీ సమీపంలోని కోటగిరి అనే ప్రాంతంలో జోనల్ అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పదేళ్లుగా మత సామరస్యం కోసం పనిచేస్తూ యుఆర్ఐ కోసం శ్రమ పడుతున్న విధానాన్ని గమనించిన సౌత్ ఇండియా జోనల్ కౌన్సిల్ డాక్టర్ అబ్రహం, మత్తయి కుట్టి, పాలకవర్గం ప్రశంసించి సుభద్రకు ఉత్తమ సిసి అవార్డు ప్రధానం చేసి మెమోంటో, ప్రశంసా పత్రం ఇచ్చి శాలువతో సన్మానించారు. అవార్డుతో తనపై ఇంకా బాధ్యత పెరిగిందని ప్రపంచ శాంతి కోసం నిరంతరం కృషి చేస్తానని సుభద్ర తెలిపారు.

రైతులను, రైతు కూలీలను ఆదుకోవాలి : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రైతులను, రైతు కూలీలను ఆదుకోవాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితులవల్ల కరవు ఏర్పడడంతో దుర్భర పరిస్థి తులను రైతులు ఎదుర్కొంటున్నాంన్నారు. నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అందివ్వ లేదని, ప్రతి రైతుకూ ఒకే విడతలో రూ.20 వేలు రైతు భరోసా కింద వెంటనే చెల్లించాలని కోరారు. ఖరీఫ్ సీజన్ కూడా ముగింపు దశకు వచ్చిందన్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోయాయని, జులైలో వేలాది ఎకరాల్లో సాగుచేసిన వేరుశనగ పంట, ఇతర పంటలు పూత వచ్చే కీలక దశలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో పంట పూర్తిగా నిలువునా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ బోర్లలో నీటిమట్టం అడుగంటు పోవడంతో సాగు చేసిన టమోటా ఇతర కూరగాయల పంటలు ఎండిపోవడంతో పొలాలపైనే ఈ కూరగాయల పంటలను వదిలివేశారన్నారు. మామిడి ఇతర పండ్ల తోటలు తీవ్ర వర్షాభావంవల్ల ఎండిపోతున్నాయని చెప్పారు. వర్షాలు లేనందువల్ల రైతులు పంట వేసినా, వేయకున్నా, ఇక్రాప్ బుకింగ్‌కు సంబంధం లేకుండా ప్రతి రైతుకూ ఎకరాకు రూ.10 వేల రిహారం చెల్లించాలని, ఉచితంగా బోర్లు వేయాలని, పండ్లతోటల రైతులకు ఎకరాకు రూ. 20 వేలు చొప్పున పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ఆలోచనలు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రతి రైతునూ, రైతు కూలీలను ఆదుకోవాలని కోరారు.

దారి ఆక్రమణపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని మందరం రాచపల్లిలో పొలాలకు వెళ్లే దారిని సంపతి చంద్ర అనే వ్యక్తి ఆక్రమించాడని గ్రామస్తులు సోమవారం సబ్ కలెక్టర్ వైఖోమ్ నిధియా దేవికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా తాము పొలాలకు వెళ్లేందుకు ఆ దారిని వినియోగించుకునేవారమని పేర్కొన్నారు. దారి ఆక్రమణకు గురికావడంతో పొలాలకు వెళ్లేందుకు అవకాశం లేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన చెందారు. ఆక్రమణ తొలగించాలని విఆర్ఒ హెచ్చరించినా ఆక్రమణదారుడు లక్ష్య చేయలేదని, సబ్ కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరారు.

అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధించి ఎప్పటికప్పుడూ అర్జీదారుల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేస్తోందని చెప్పారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని చెప్పారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ రాజేంద్రన్ పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలపై డివైఇఒకు యుటిఎఫ్ వినతి

డివైఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం యుటిఎఫ్ నాయకులు డివైఇఒకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అవుతున్నా ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే సౌకర్యాలు, మున్సిపల్ టీచర్లకు వర్తించడం లేదన్నారు. మున్సిపల్ హైస్కూల్స్‌లో ఇప్పటికీ తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో 3, 4, 5వ తరగతులను విలీనం చేశారే తప్ప ఆ తరగతులు బోధించడానికి స్కూల్ అసిస్టెంట్‌లను ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమోషన్లు, బదిలీలు జరగడం లేదని, అర్బన్ ఎంఇఒ పోస్టులు ఇవ్వడం లేదని తెలిపారు. పిఎఫ్ ఖాతాలు నిరుపయోగంగా ఉన్నాయని, జీతాల నుండి మినహాయించే సొమ్ము వారి అవసరాలకు వినియోగించు కునేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. మున్సిపల్ టీచర్ల ఆందోళన రోజు రోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యాచరణ చేపట్టాలని యుటిఎఫ్ నిర్ణయించిందని, సమస్యలు పరిష్కరించని నెరపథ్యంలో యూటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 26-28, అక్టోబర్ 02, 17, 24వ తేదీలలో అధికారులకు వినతి పత్రాలు అందజేసి మున్సిపాలిటీలలో, డిఇఒ కార్యాలయాల వద్ద సత్యాగ్రహ దీక్షకు దిగుతామన్నారు. 24వ తేదీ ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ ఉపాధ్యాయుల ఆందోళన తీవ్రతరం కాకముందే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు టి.సుధాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, సుధాకర్, రవీంద్ర, రామచంద్ర, విజయ్ కుమార్, దివాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్యాయం తగదు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లు విద్యార్థులకు సరిగ్గా బోధన చేయకుండా ఇతర ప్రయివేట్ జూనియర్ కళాశాలలో పనిచేస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నారని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు బోధన చేస్తున్న జువాలజీ, బోటనీ, తదితర గెస్ట్ లెక్చరర్లు మధ్యలో పట్టణంలోని ఇతర ప్రయివేటు జూనియర్ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్నారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు పట్టణ నాయకులు సాదిక్, మసూద్, మౌలాలి, మహమ్మద్, షరీఫ్ పాల్గొన్నారు.

కళాశాల అధ్యాపకులతో ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి

సాయి డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే,ఫేర్వెల్ ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, తిరుపతిలోని ఎలైట్ ఆస్పత్రి డైరెక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, జనసేనప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, టిడిపి యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి, బొక్కసం సునీల్‌కుమార్, జనసేన సీనియర్ నాయకులు జోగినేని మణి పాల్గొని విద్యార్థులకు అమూల్యమైన సందేశాలను అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి విద్యార్థులను ఉత్సాహపరిచి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ చంగల్‌రాజు, డైరెక్టర్లు ఎస్ఎన్.శ్రీనివాసులు, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాయితీపై ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో వర్ష బావ పరిస్థితులు కారణంగా వేరుశెనగ విత్తన రైతులకు కరువు ఆధారిత ప్రణాళిక కింద 80 శాతం రాయితీపై ఉలవలు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి స్వాతి తెలిపారు. సోమవారం మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో రైతు భరోసా కేంద్రంలో బయోమెట్రిక్ ద్వారా ఉలవలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 10 కిలోల ఉలవల బ్యాగులను టిడిపి నాయకుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఇ-క్రాఫ్, ఇకెవైసి నమోదు చేయించుకుని ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ విత్త నాలు, ఎరువులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి మంజునాథ్, మహర్షి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యత పెంచడం అభినందనీయం : డిఇఒ

ప్రజాశక్తి-రామాపురం

విద్యార్థులను నైపుణ్యత కలిగిన నిపుణులుగా తీర్చి దిద్దడం అభినందనీయమని డిఇఒ శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని బిట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎసిఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ విజన్-2047 సెమినార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విజన్-2047 విస్తృత లక్ష్యాలకు దోహదపడేలా బిట్స్ ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు ఆవిష్కరణ పరిశోధనల అభివృద్ధికి దోహదపడే నైపుణ్యాలు నేర్పించడం ప్రశంసనీయమని అన్నారు. అనంతరం బిట్స్ విద్యాసంస్థల డైరెక్టర్ భాస్కర్, ప్రిన్సిపల్ డిఇఒ శివ ప్రకాష్ రెడ్డి ని సన్మానించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్లు అందించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

పింఛన్ దారులకు ఉదయం ఐదు గంటలకే పింఛన్లనుపంపిణీ చేయాలని పంచా యతీ కార్యదర్శులకు ఎంపిడిఒ మల్లీశ్వరి సూచించారు. సోమవారం ఎంపిడిఒ కార్యాల యంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పింఛన్ దారులకు ఉదయం 5 గంటలకే ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేయా లన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. **బి. కొత్తకోట :** మండలంలో సామాజిక పెన్షన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు ఎంపిడిఒ బాలాజీ పేర్కొన్నారు.మంగళవారం మండలానికి సంబంధించి 15 పంచాయతీలకుగాను 7949 లబ్ధిదారులకు మొత్తం మూడు కోట్ల 42 లక్షల 71 వేల ఐదు వందల రూపాయలు విడుదలయ్యాయన్నారు.

మా భూములు మాకు కేటాయించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తమ జీవనానికి భూములు కేటాయించాలని మండలంలోని గట్టు గ్రామానికి చెందిన ముడివారిపల్లి పేదరైతులు సోమవారం మండల డిప్యూటీ తహసిల్దార్ మహమ్మద్ అన్సారికి వినతిపత్రం సమర్పించారు.1995 సంవత్సరంలో గట్టుకు చెందిన ఆలూరి కుటుంబ పెద్దలు, అంతవరకు మేము కౌలుకు చేసుకుంటున్న వారి భూములను తమకు అమ్ము కున్నారన్నారు. అప్పటినుంచి ఇప్పటి వరకు సదరు భూములు రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వలేదని వాపోయారు.సుమారు 40 మంది రైతులు 22 ఎకరాల విస్తీర్ణం ఉన్న భూములను కొనుగోలు చేశామని,ఇప్పుడు కూడా మాకు అమ్మిన భూముల్లోనే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తు న్నామన్నారు. మేము ఇచ్చిన డబ్బులకు రసీదులు మాత్రమే ఇచ్చారని,ఎలాంటి హక్కు పత్రాలు రాసి ఇవ్వలేదని,ఇప్పుడు సదరు భూములను వేరే వారికి అమ్మకానికి పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మా భూములను మాకే కేటాయించాలని కోరారుకార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి,రఘునాథ్, ఎం.అష్రఫ్‌అల్లి, ఎస్.బషీర్ ఖాన్, హెచ్.షమీవుల్లా, ఎం.గంగులప్పలు పాల్గొన్నారు.

'నేతన్న హస్తం' తిరిగి ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి-గాలివీడు

నేతన్న హస్తం పథకం తిరిగి పునరుద్ధరించాలని చేనేత సంక్షేమ సంఘం రాయ చోటి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోరెండు లక్షల డెబ్బైవేల మంది కుటుంబాలు నేత పరిశ్రమల ఆధారపడి జీవిస్తుంటే గత ప్రభుత్వం 73 వేల మందికి మాత్రమే పింఛన్ పథకాన్ని వర్తింపజేసిందని కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైన చేనేత కార్మికులకుపై దృష్టిపెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ పథకం అందేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఓబులేష్ యాదవ్, పుల్లగూర శ్రీనివాసులు, గంజికుంట, గంగాధర, బోలిశెట్టి లక్ష్మయ్య పాల్గొన్నారు.

ముత్తూట్ ఫైనాన్స్ నూతన బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లిలో నూతనంగా ఏర్పాటుచేసిన ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్‌ను రాయచోటి నియోజవర్గ టిడిపి యువ నాయకుడు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ కస్టమర్లకు మంచి సేవలును అందించి అభివృద్ధి చెందాలని అన్నారు. రైతులకు, మండల ప్రజలకు తక్కువ రేటుతో వడ్డీ రుణాలు అందించి మండల ప్రజలు ఆర్థికంగాఎదిగేందుకు కృషి చేసి ప్రజల మన్ననలు పొందాలని ముత్తూట్ ఫైనాన్స్ యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకుడు మదన్ మోహన్, టిడిపి రాజంపేట డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీ నాయక్, ముత్తూట్ ఫైనాన్స్ బిల్డింగ్ యజమాని సెల్లు శ్రీనివాస్ యాదవ్, ముత్తూట్ బ్రాంచ్ ఫైనాన్స్ మేనేజర్ బండి నరేష్, కొమ్మిణ పల్లి శివశంకర్, చెల్లు సురేంద్ర, టిడిపి ప్రచార కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

జిల్లా ఛాంపియన్స్‌గా రాజంపేట డివిజన్ జట్టు

ప్రజాశక్తి-పుల్లంపేట

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ఉపాధ్యాయులు అందరికీ రాయచోటిలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీలలో జిల్లాలోని రాజంపేట డివిజన్ జట్టు ఛాంపియన్స్‌గా నిలిచారు. వాలీబాల్, చెస్, క్యారమ్స్, షటిల్ డబుల్స్, సింగి ల్స్‌లో విజయం సాధించి రాజంపేట జట్టు ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసు కుంది. వాలీబాల్‌లో ప్రసాద్, భాస్కర్, ఈశ్వర్‌నాయక్, సురేంద్ర, సాయిరాం, అబ్దుల్లా, బాల శేఖర్‌లు విజయం సాధించారు. క్యారమ్స్‌లో రమేష్ జోషి, సుధాకర్ విజేతలుగా నిలిచారు. చెస్ లోరమేష్ జోషి, షటిల్ సింగిల్స్‌లో ఈశ్వర్‌నాయక్, డబుల్స్ ఈశ్వర్‌నాయక్, చంద్రకుమార్ గెలుపొందారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బిల్లా హరిప్రసాద్, జాబీర్ మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన విద్యార్థులు 4 నుంచి గుంటూరులో జరిగే ఆటల పోటీలకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. జిల్లా కార్యదర్శులు సివి రమణమూర్తి, వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్ రాజు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో గెలిచి జిల్లాకు పేరు తీసుకురావాలని పేర్కొన్నారు.

సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కలికిరి

కిశోర బాలికలు సమాజం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ చెన్నారెడ్డప్ప తెలిపారు. సోమవారం మండలంలోని మహల్ ప్రాథమికోన్నత పాఠశాలలో కిషోర్ బాలికలకు ఆరోగ్యం, సమాజం పట్ల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారి ఆదేశాల మేరకు హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, బాల్యవివాహల వల్ల కలుగు అనర్థాలు, పౌష్టికాహారం ప్రాముఖ్యత, కాలానుగున వ్యాధులు, టోల్‌ఫ్రీ నంబర్స్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ కిశోర బాలికలు మంచి స్పర్శ, చెడు స్పర్శ లపై తెలుసుకుని ఉండాలని సమాజంలో గాని వేరే ఎక్కడైనా గాని మీ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లేదా శరీరం పై భుజాలపై, ఛాతి పైన, తొడల పైన చేతులు వేయడం, చెంపలపై బుగ్గలు గిల్లడం, సైగలు చేయడం వంటి చేష్టలు చేసినట్లయితే వెంటనే కేకలు వేయడం చేయాలన్నారు. పాఠశాలలో అయితేహెచ్ఎం దృష్టికి , వీధుల్లో అయితే తల్లిదండ్రుల దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులు లోబరుచుకోవడానికి తిను బండారాలు, వస్తువులు, బహుమతులు ఆశ చూపించినా వాటికి ఆశ పడి వారి వెంట వెళ్లరాదని సూచించారు. ఒంటరిగా వెళ్ళేటప్పుడు లిఫ్ట్ ఇస్తామని ఆటో, బైక్, సైకిల్ లాంటి వాటిల్లో పిలిచిన వెళ్లరాదని హెచ్చరించారు. బాల్య వివాహాలు వల్ల భవిష్యత్ లేకుండా పోతుందని తెలిపారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి టి.బి అంటువ్యాధులు రావని తెలిపారు. దోమల వల్ల మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని తెలిపారు. తాగునీరు కలుషితం వల్ల డయేరియా, డిసెంట్రీ, కామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు.మరుగుదొడ్లు తప్పక ఉపయోగించాలని, చేతుల శుభ్రత పాటించాలని, క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్స్ 100,112,1098 లకు అత్యవసర సమయాల్లో, ప్రమాదంలో ఉన్నపుడు, సహాయం కొరకు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు నాగవేని, లలిత, ఎఎన్ఎంలు రాజేశ్వరి, బసిరి ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

పుల్లంపేట: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ

ప్రజాశక్తి-కలకడ

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకువిద్యార్థులు ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యా యులు మోడం చంగల్ రాయుడు తెలిపారు. మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో చదువుతున్న విద్యార్థులకు మదనపల్లి బిటి కళాశాలలో ఈనెల 28న జరిగిన జిల్లా స్థాయి ఎంపికలో బాలురు విభాగంలో ఐదుగురు, బాలికల విభాగంలో ఇద్దరు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు తో పాటు క్రీడల్లోనూ రాణిస్తే విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుందని తెలి పారు. అండర్-17హ్యాండ్ బాల్ బాలికల విభాగంలో ఫర్హానా, సమీరా, బాలుర విభాగంలో యోగేశ్వర్, రెడ్డి ప్రసాద్, సమీర్‌ఖాన్, జితేంద్ర, షారుఖాన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ ఝాన్సీరాణిని ఉపాధ్యాయులు అభినందించారు. వీరు 7, 8 తేదీలలో రాజ మండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారు.

పుల్లంపేట : మండల పరిధిలోని ఏపి మోడల్ స్కూల్‌లో విద్యార్థులు సోమవారం జడ్‌పి హెచ్ఎస్ రాయచోటిలోని మాసాపేట జడ్‌పి హైస్కూల్‌లో జరిగిన అండర్-14, అండర్-17 సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారని పీడీ నీలకంఠ రావు తెలిపారు. అండర్-17 విభాగంలో జాస్మిన్ తొమ్మిదవ తరగతి, అండర్-14 బాలుర విభాగంలో సాంబశివుడు 8వ తరగతి, అండర్-17 బేస్ బాల్ విభాగంలో హేమంత్ తొమ్మిదవ తరగతి విద్యార్థులురాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని విద్యార్థు లను కళాశాల ప్రిన్సిపల్ లీలా శ్రీహరి అభినందించారు.

షాట్‌పుట్ పోటీల్లో నాగిరెడ్డిపల్లె విద్యార్థి..

నందలూరు: ఇటీవల ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన షాట్ పుట్ పోటీల్లో మండలంలోని నాగిరెడ్డి పల్లె ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి సయ్యద్ ఉమర్ ఉస్మాన్ అలీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కడపలో జరిగిన పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థుల్లో ఉమర్ ఉస్మాన్ అలీ రెండవ స్థానంలో నిలిచారు. ఇందుకోసమై పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుని గౌరీ చేసిన కృషి అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయలలిత కుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిఇటి గౌరీని ఉమర్ ఉస్మాన్‌అలీని ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఖాదర్‌బాషా, గంగనపల్లి వెంకటరమణ, సుబ్బరాయుడు, విజయకుమారి, తులసి స్వర్ణలత, రమణమ్మ, జ్యోతి ప్రియ పాల్గొన్నారు.

డిస్క్‌త్రోలో గౌతమ్ స్కూల్ విద్యార్థి..

గాలివీడు: కడపలో జరిగిన పోటీలలో డిస్క్‌త్రోలో గౌతమ్ స్కూల్ విద్యార్థి అభిషేక్ అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయికి ఎంపికైన అభిషేక్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా జట్టుకు ఎంపికైన ఎస్‌వి కళాశాల విద్యార్థులు

రైల్వేకోడూరు: పులివెందుల, మైదుకూరు, పుల్లంపేటలో జరిగిన ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలలో ఎస్‌వి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటి జిల్లా జటుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్ ఎన్ శ్రీనివాసులు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, సాఫ్ట్ బాల్, బేస్ బాల్, క్రికెట్ పోటీలకు పది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పాల్గొనే కడప జిల్లా జట్టుకు ఆయా క్రీడల్లో ఎంపికయ్యారని తెలిపారు. ఈ క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులనుప్రిన్సిపల్, డైరెక్టర్ వసుం దర, వ్యాయామ ఉపాధ్యాయులు పుల్లారావు, అధ్యాపకులుఅభినందించారు.

నాగిరెడ్డిపల్లెకు వైద్యశాలను మంజూరు చేయండి

- మంత్రి సత్యకుమార్‌కు సర్పంచ్ వినతి

ప్రజాశక్తి-నందలూరు

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీలో ప్రభుత్వ వైద్యశాల మంజూరు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్‌కు నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. సోమవారం కడపకు వచ్చిన మంత్రిని కలిసి నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచా యతీలో నాగిరెడ్డిపల్లి, కుమ్మ రపల్లి, ఇసుకపల్లి, ఇసుకపల్లి హరిజనవాడ నారాయణరాజుపేట, అరవపల్లి గాంధీనగర్, తోటపాలెం బస్టాండ్ లతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో దాదాపు 20 వేల మంది జనాభా ఉన్నారని అన్నారు. ఈ ప్రాంతంలో వైద్యశాల లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు నూతన మినీ వైద్యశాలను మంజూరు చేయడం ద్వారా నాగిరెడ్డిపల్లి గ్రామ ప్రజలతో పాటూరు, తొగురుపేట గ్రామస్తులు కూడా ఎంతో అనువుగా ఉంటుందని ఈ విషయాన్ని తమరు దృష్టిలో పెట్టుకొని వైద్యశాల మంజూరు చేయాలని మంత్రికి వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పోతురాజు మస్తానయ్య. జిల్లా మాజీ వక్ఫ్ బోర్డ్ కార్యదర్శి సయ్యద్ అమీర్, గోపినేని హిమ గిరినాథ్ యాదవ్, ప్రసాద్, పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

మాక్ పార్లమెంటు నిర్వహిస్తున్న విఎస్ఎన్ సిద్ధార్థ విద్యార్థులు

'ఆసక్తిగా మాక్ పార్లమెంట్'

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులోని విఎస్ఎన్ సిద్ధార్థ ఒలింపియాడ్ క్యాంపస్‌లో సోమవారం నిర్వహించిన మాక్ పార్లమెంటు కార్యక్రమం విద్యార్థుల్లో ఆసక్తిని రేపింది. పార్లమెంటరీ వ్యవహారాలు, రాజకీయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో విద్యార్థుల ద్వారా మాక్ పార్లమెంటు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు విఎస్ఎన్ సిద్ధార్థ సంస్థల ఆధినేత్రి వడ్లమూడి మాధవి తెలిపారు. ఒలింపియాడ్ క్యాంపస్ లోని 6వ నుంచి 9వ తరగతి విద్యార్థులు అధికార, విపక్ష సభ్యులుగా విడిపోయి, మాక్ పార్లమెంటులో పాల్గొన్నారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గింపు, రక్షణ శాఖ, విద్యాశాఖకు బడ్జెట్ పెంపు వంటి అంశాలపై విద్యా ర్థులు క్షుణ్ణంగా చర్చించి అందరినీ ఆకట్టుకున్నారు. మాక్ పార్లమెంటు కోసం విద్యార్థులను సమ గ్రంగా సన్నద్ధం చేసిన ఉపాధ్యాయులను కరస్పాండెంట్ అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలపై బాధ్యత ఉండాలి

ప్రజాశక్తి-పీలేరు

విద్యార్థులకు విద్య, నాయకత్వంతోపాటు, పరిసరాలపై బాధ్యత ఉండాలని సైనిక్ స్కూల్ జెటిఒ వాంబడే తెలిపారు. సోమవారం కలికిరిలోని సైనిక్ స్కూల్ ఎన్‌సిసి క్యాడెట్లు పీలేరులోని పింఛానదిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పునీత్ సాగర్ కార్యక్రమంలో భాగంగా నీటి వనరులను శుభ్రపరిచేందుకు వారు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుకనున్న పింఛా నదీ పరీవాహక ప్రాంతంలోని వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసం, నాయకత్వ లక్షణాలతోపాటు పరిసరాలపై బాధ్యత ఉండాలని విద్యార్థులకు తెలియజేసేందుకు పింఛా నదిలో ఎన్‌సిసి క్యాడెట్ల ద్వారా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. పచ్చదనం పరిశుభ్రతను కాపాడాలని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనమంతా ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్య క్రమంలో సైనిక్ స్కూల్ కేర్ టేకింగ్ ఆఫీసర్లు (సిటిఓలు) స్వామినాథ్, తిలక్ నందన్, తెలుగు ఉపాధ్యాయులు చిరంజీవి, ఎస్.సి.ఓ రవీందర్, సిబ్బంది అశోక్ పాల్గొన్నారు.

'చెత్త నుంచి సంపద' పునఃప్రారంభం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండలంలోని ఎర్రసానిపల్లె పంచాయతీలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సోమవారం ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్ పునః ప్రారంభించారు. ఈ సేవా కార్యక్రమాలలో భాగంగా ఈ కేంద్రాన్ని వినియోగంలో తీసుకువచ్చి సంపద తయారీకి గ్రామస్తులందరూ సహక రించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుగుణమ్మ, పంచాయతీ కార్యదర్శి రఘునాథ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని బొమ్మవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో టిడిపి యువ నాయకులు ఉమ్మలరాజు సుబ్బరాజు ఆధ్వర్యంలో సుమారు 120 మంది విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు, డ్రాయింగ్ స్కేలు వంటి విద్యాసామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానంద రెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని, దీనిని ప్రతి ఒక్కరూ గమనించాలని పేర్కొన్నారు. పాఠశాలకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తమను సంప్రదిస్తే రూపానందరెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలను అభివృద్ధి చేయడానికి ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉమ్మల రాజు పిచ్చిరాజు, గడ్డం సాంబశివరావు, శకునాల శివరాజు, చక్రవర్తుల అనంతరాజు, నరసింహరాజు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఆధునికీకరణకు చర్యలు

ప్రజాశక్తి-పీలేరు : పీలేరు ఆర్‌టిసి బస్టాండులో శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్లను త్వరలోనే అధునికీకరిస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి రాము తెలిపారు. స్థానిక ఆర్‌టిసి డిపో కార్యాలయంతోపాటు బస్టాండును సోమవారం ఆయన పరిశీలించారు. ఆటు డిపో కార్యాల యం ఇటు బస్టాండులోనూ మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకుని ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. వాటి ఆధునికీకరణకు ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని అప్పటికప్పుడు రవాణా శాఖ సివిల్ ఇంజినీరింగ్ సిబ్బందికి ఆదేశించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పీలేరుతో పాటు కలకడ బస్టాండులోనూ మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. తమ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే మదనపల్లెలో పెట్రోలు బంకు నడుస్తోందని, దాని ద్వారా నెలకు రూ.215 లక్షల ఆదాయం సమకూరుతోందన్నారు. రాజంపేటలోనూ పెట్రోలు బంకు ప్రారంభానికి సిద్ధంగా ఇందని, త్వరలోనే మంత్రి రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా దాన్ని ప్రారంభిస్తామన్నారు. జిల్లాకు 40 కొత్త బస్సులు రావాల్సి ఉండగా ఇప్పటికి 14 బస్సులు వచ్చాయని, మరో ఆరు నెలల్లో మిగిలిన బస్సులు కూడా వస్తాయన్నారు. జిల్లా పరిధిలోని అన్ని డిపోల్లోనూ పల్లెవెలుగు సర్వీసులు ఎక్కువగా ఉన్నాయని, కేవలం ప్రజల సౌకర్యార్థం నడుపు తున్న సర్వీసుల కారణంగా అధిక నష్టాలు వస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని గుర్తించి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సులను ప్రోత్సహించాలని ఆయన గ్రామీణ ప్రాంత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన పీలేరు డిపో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిఎం బండ్ల కుమార్, సిఐ సుబ్బమ్మ, పాల్గొన్నారు.

రాజంపేట : సక్షం అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిడిపిఒ సుజామణి

సక్షం అంగన్వాడీ కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని అనంతంపల్లి అంగన్వాడీ కేంద్రం సక్షం అంగన్వాడీ కేంద్రంగా ఎన్నికైందని అంగన్వాడీ కార్యకర్త వనజాకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలో ఉన్న గ్రామాలలో అనంతంపల్లి ఎంపిక కావడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. సక్షం అంగన్వాడీ కేంద్రానికి బెంచీలు, ఫ్యాను, వాటర్ ప్యూరిఫైయర్ తదితర మౌలిక వసతులు అన్ని ప్రభుత్వం కల్పించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. వైద్య సిబ్బంది జ్యోతి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండడానికి పరిసరాలన్నింటినీ శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో జానకిపురం కార్యకర్త రెడ్డమ్మ, చాపల దళితవాడ కార్యకర్త సుబ్బలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది గురవయ్య పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సాక్ష్యం అంగన్వాడీ కేంద్రాలను సిడిపిఒ సుజామణి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సిడిపిఒ సుజామణి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పోషణ మాసోత్సవాలను ప్రతి అంగన్వాడీ కేంద్రంలో జరిగే విధంగా కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు కేలండర్ ప్రాతిపదికన నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజంపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో బలిజపల్లి, మునక్కాయలపల్లి, మందరం, రాచపల్లి, నారంరాజుపల్లి మున్సిపాలిటీ పరిధిలో బలిజిపల్లి అంగన్వాడీ కేంద్రంలో సక్షం అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభోత్సవం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాజంపేట ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ హను మంతు రమేశ్, జూనియర్ అసిస్టెంట్ కే.కవిత, సూపర్వైజర్ కే.రాణి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి-వీరబల్లి

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా అన్నారు. సోమవారం మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లితండ్రులు హాజర య్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని సూచించారు.ఇంటిదగ్గర విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రఘురామయ్య మాట్లాడుతూ విద్యార్థులు సమా జంతో పాటు పోటీ పడాలని, జ్ఞానాన్ని పెంచుకోవాలని, నిత్య పఠనం జ్ఞానాన్ని పెంచు తుందన్నారు. కళాశాలకు నిత్యం క్రమం తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. విద్యార్థులు సమాజంలో చెడు వ్యసనాలకు బానిస కాకూడదన్నారు.కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్-2, భాస్కర్, చంద్రశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, అరుణమ్మ, చంద్రకళ, వేణుగోపాల్, ప్రసాద్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్లయ్య కొండ ఇఒగా మునిరాజు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండల కేంద్రానికి సమీపంలో మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయ ఇఒగా మునిరాజు బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో కూడా మల్లయ్య కొండ ఇఒగా పని చేశారు. ఇక్కడ ఇఒగా పని చేస్తున్న రమణ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో మొగలిలోని మొగలేశ్వర ఆలయంలో ఇఒగా పనిచేస్తున్న మునిరాజు బదిలీపై మల్లయ్య కొండ ఈవోగా వచ్చారు. మల్లయ్య కొండ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

లక్కిరెడ్డిపల్లి అభివృద్ధికి కృషి చేస్తాం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లి మండలాన్ని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహ కారంతో అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఎటువంటి సమస్య లేకుండా చేసేందుకు కృషి చేస్తామని మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలో త్రాగునీరు, కరెంటు, ఉచిత వైద్యం, రవాణా, డ్రైనేజీ సమస్యలు లేకుండా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీటి సమస్య కొరకు బోర్లు వేసి తాగునీరు సరఫరా చేస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న రాయచోటి- చాగలమర్రి హైవేను మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మండల నాయకుడు యనమల మదనమోహన్, రాజంపేట డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాక్టర్ షఫీ నాయక్, నసిరుద్దీన్, మక్బుద్, కావలి ఆంజనేయులు,విశ్వనాథ్,నజీర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

క్రైం కార్నర్

సాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నిషేధిత నాటుసారా విక్రయిస్తున్న మహిళను మదనపల్లె వన్ టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అరెస్టుకు సంబంధించి ఎస్ఐ ఆన్సర్‌బాషా కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, బెంగుళూరు రోడ్డులోని నక్కల దిన్నె తండాకు చెందిన కళావతి(45) గత కొంత కాలంగా గుట్టు చప్పుడు కాకుండా స్థానికులకు నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు నిఘా ఉంచి సిబ్బందితో వెళ్లి కళావతి ఇంట్లో సోదాలు జరపగా, అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 30 లీటర్ల నిషేధిత నాటుసారా లభించడంతో సీజ్ చేశామన్నారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని విచారించగా సారా విక్రయిస్తున్నట్లు నేరం అంగీకరిం చడంతో కేసు నమోదు చేసి అరెస్టు చేసి డిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

ప్రజాశక్తి-గాలివీడు

గుర్తు తెలియని వాహనం ఢీకొని బాలిక మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఎగువగొట్టివీడు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎగువగొట్టువీడు గ్రామానికి చెందిన రమేష్ కుమార్తె హర్షిత(12) రోడ్డు దాటు తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి పోయిందని తెలిపారు. వెంటనే బాలిక బంధువులు చికిత్స నిమిత్తం రాయచోటి ఆస్పత్రి తీసుకపోగా చికిత్స పొందుతూ మృతి చెందిందని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి వాహనం ఆచూకీ కనుగొంటామని ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు.

బాధితుడికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-రామసముద్రం

మండల కేంద్రమైన రామ సముద్రానికి చెందిన ఆదినారాయణరెడ్డిని అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆదివారం దాడి చేశారని బాధితుని ఫిర్యాదు మేరకు రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని సోమవారం ఆదినారాయణరెడ్డి మద్దతు దారులు రామసముద్రం బంద్‌కు పిలుపునిచ్చారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆందోళనకారులతో మాట్లాడి చట్టప్రకారం న్యాయం చేస్తామని,ఆందోళన చేయవద్దని సూచిం చారు. మదనపల్లె రూరల్ సిఐ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య జఠిలం కాకుండా చూశారు. ఎక్కడ ఎలాంటి వాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.